సాక్షి గణపతికి పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై శ్రీశైల మహా క్షేత్రంలోని సాక్షి గణపతికి, జ్వాలా వీరభద్రస్వామికి బుధవారం అర్చకులు పూజలు నిర్వహించారు. పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం తదితర విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన తాండవ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.

మీసం మెలేస్తున్న సైబర్ నేరగాళ్లు!



బ్యాంక్ ఖాతాల్లో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారు. సైబర్ పోలీస్ స్టేషన్‌లో 2022లో 56, 2023లో 39 కేసులు నమోదయ్యాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

..8లో

న్యూస్‌రీల్

సీఎం ప్రమాణస్వీకార వేడుక వీక్షణ



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ సృజన, జేసీ మౌర్య, ఇతర అధికారులు

కర్నూలు(సెంట్రల్): అమరావతిలోని గన్నవరం సమీపంలో ఉన్న కేసరిపల్లిలో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వేడుకను అధికారులు, ప్రజలు ప్రత్యక్ష ప్రచారం ద్వారా వీక్షించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్రీన్ల ద్వారా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో కె.మధు సూదన్ రావు, ఇతర శాఖల అధికారులు వీక్షించారు. జిల్లాలో పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయాలు, ఆదోని, ఎమ్మిగనూరు మునిసిపల్ కార్యాలయాల్లోనూ సీఎం ప్రమాణ స్వీకారాన్ని ప్రత్య క్ష ప్రసారం ద్వారా అధికారులు, ప్రజలు వీక్షించారు.


బక్రీద్ రోజున గోవులను వధిస్తే కఠిన చర్యలు

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జి.శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 17న నిర్వహించే బక్రీద్ పండుగ సందర్భంగా జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు ఉంటాయని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. బక్రీద్ నేపథ్యంలో గోవధను అరికట్టేందుకు జిల్లా, గ్రామ స్థాయిలో జంతుసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా నోడల్ అధికారిగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మల్లన్న (95055 01552 కర్నూలు నగరపాలక సంస్థ), డాక్టర్ దినకర్(99660 83337)లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. కర్నూలు బహుళార్థ పశువైద్యశాల డీడీ డాక్టర్ హేమంత్‌కుమార్‌ను పర్యవేక్షణాధికారిగా నియమించినట్లు తెలిపారు. గోవధ, జంతు సంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నియమాలు 1978, స్లాటర్ హౌస్ రూల్స్ 2001 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

టీబీ డ్యాంలో 5.5 టీఎంసీల నీరు

- జలాశయానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) ద్వారా తాగు, సాగు నీరునందించే తుంగభద్ర రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. బుధవారం జలాశయంలో 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మేనెలాఖరు వరకు డ్యాంకు ఇన్‌ఫ్లో ఉండేది కాదు. జలాశయంలో 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేది. కొద్ది రోజులుగా డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తోంది. అవుట్‌ఫ్లో 9 క్యూసెక్కులుండగా ఇన్‌ఫ్లో 4,266 క్యూసెక్కులుగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జలాశయంలో 1581.09 అడుగులతో 5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేలకూలిన భారీ వృక్షం



మహానంది: మహానందిలోని గరుడ నంది ఆలయ సమీపంలో భారీ చింత వృక్షం బుధవారం నేలకూలింది. సుమారు 120 ఏళ్లకు పైగా ఉన్న వృక్షం ఇటీవల కురుస్తున్న వర్షాలతో నేలకొరిగింది. నిత్యం భక్తులు చెట్టు కింద సేద తీరేవారు. కాగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మోగనున్న బడి గంట!



- నేడు పునఃప్రారంభం కానున్న పాఠశాలలు
- మొదటి రోజే విద్యార్థి చేతికి పాఠ్యపుస్తకాలు, విద్యార్థి కిట్లు
- పదోన్నతులతో హైస్కూళ్లలో పెరిగిన సబ్జెక్టు టీచర్లు
- గత ప్రభుత్వ చర్యలతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నుతున్న సర్కారీ స్కూళ్లు



కర్నూలు (సిటీ): వేసవి సెలవుల్లో ఆటాపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి బడి బాట పట్టనున్నారు. మూలకు పడేసిన పుస్తకాల బ్యాగులను, టిఫిన్ బాక్సులను దుమ్ముదులిపి సిద్ధం చేసుకుంటున్నారు. బడులు తెరిచిన మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, విద్యార్థి కిట్లు పంపిణీ చేయడానికి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే సౌకర్యాలు ఉండేవి కాదనే అపవాదు ఉండేది. గత ప్రభుత్వ చర్యలతో నేడు సర్కారీ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. జిల్లాలో ఎక్కడికి వెళ్లినా సరికొత్తగా ప్రభుత్వ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. మనబడి నాడు- నేడు కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 707.87 కోట్ల ఖర్చు చేస్తుంది. దీంతో పాటు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు 1,876 టీచర్ పోస్టులను ఇతర జిల్లాల నుంచి బదలాయించింది. ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి హైస్కూళ్లలో టీచర్ల కొరత తీర్చింది. పేద విద్యార్థుల చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరుతో పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్ట్స్, బ్యాగ్స్, డిక్షనరీలు ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఈ పథకం పేరును విద్యార్థి కిట్లుగా మార్పు చేశారు. ఈ కిట్లను మొదటి రోజునే విద్యార్థి చేతిలో పెట్టేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సరికొత్తగా సర్కార్ బడి

జిల్లాలో 1,436 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,433 స్కూళ్ళ రూపురేఖలు మార్చేందుకు మన బడి నాడు-నేడు అనే గొప్ప కార్యక్రమానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో 594 పాఠశాలల్లో రూ.186.07 కోట్లు, రెండో విడతలో 1,094 స్కూళ్లలో రూ.521.80 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో 457 స్కూళ్లలో అదనపు తరగతి గదులు, 367 స్కూళ్లకు రక్షణ గోడలు నిర్మించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని స్కూళ్లలో 11,381 టాయిలెట్లు అవసరం కాగా 100 శాతం నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికల అక్షరాస్యత శాతం పెంచేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన 26 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలో 25 స్కూళ్లలో ఇంటర్మీడియెట్ విద్యను ప్రవేశపెట్టారు. ఇందులో 20 స్కూళ్లలో నాడు-నేడు కింద ఒక్కో స్కూల్‌లో రూ.96 లక్షలతో పనులు చేపట్టారు. ప్రభుత్వ బడుల్లో అమలు చేస్తున్న ఇంగ్లిష్ మీడియం, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా యూనిఫాం, నోట్‌బుక్కులు, పాఠ్య పుస్తకాలు అంద జేస్తుండడంతో విద్యార్థులు వీటిల్లో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు.



తుగ్గలి ఎమ్మార్సీలో ఉన్న పాఠ్యపుస్తకాలు

1.46 లక్షల మంది విద్యార్థులకు కిట్లు

జిల్లాలో ప్రాథమిక 2,943, ప్రాథమికోన్నత 535, ఉన్నత 897 చొప్పున మొత్తం 4,375 ఉన్నాయి. వేసవి సెలవులు ముగిసి గురువారం నుంచి అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి స్కూల్‌లోని తరగతి గదులు శుభ్రం చేయించారు. స్కూల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచారు. స్కూల్‌లో తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, ఫర్నీచర్ శుభ్రం చేయించేలా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పునఃప్రారంభం రోజునే పిల్లలందరికీ విద్యార్థి కిట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 1.46 లక్షల మంది విద్యార్థులకు కిట్లు అందజేయనున్నారు. బ్యాగ్స్, నోట్ బుక్స్, పిక్టోరియల్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు ఇంకా పూర్తి స్థాయిలో రావాల్సి ఉంది. ప్రస్తుతానికి వచ్చిన వాటిని మండల విద్యా వనరుల కేంద్రాల నుంచి స్కూళ్లకు చేర్చుతున్నారు.

మంచి వాతావరణం ఉండాలి



జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి అన్ని స్కూల్స్ పునఃప్రారంభం కానున్నాయి. స్కూళ్లలో మంచి వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి. మొదటి రోజున ఉపాధ్యాయులందరూ కచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుంది. మొదటి రోజునే పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందజేయాలి. వచ్చిన వాటి మేరకు విద్యార్థి కిట్లను అందజేయాలి. విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలను పాటించాలి.

– కె.శ్యాముల్, డీఈఓ

భూ ఆక్రమణకు టీడీపీ నేతల యత్నం

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎర్రబాడు గ్రామస్తులు



గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎర్రబాడు గ్రామస్తులు

గోనెగండ్ల: దళితులకు ఇచ్చిన పట్టా భూమిలో కొంత భాగాన్ని అక్రమించేందుకు ఎర్రబాడుకు గ్రామానికి చెందిన తెలుగుదేశం నేతలు యత్నించారు. 'ప్రభుత్వం మాదే' అంటూ బెదిరంచడమే కాకుండా స్థలం జోలికి వస్తే అంతు చూస్తామని హెచ్చరించారు. దీంతో భయందోళనకు గురైన ఆ గ్రామ దళితులు 40 మంది బుధవారం సాయంత్రం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎర్రబాడు గ్రామ దళితులు ప్రభుదాస్, హనుమన్న, ప్రకాశం, బాలరాజు మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 1973లో పేద దళితులకు సర్వే నంబర్ 242లో 5 ఎకరాల భూమిలో పట్టాలు ఇచ్చారన్నారు. ఇందులో పంచగా 2.30 ఎకరాల భూమి మిగిలిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి వర్గీయులు, గ్రామానికి చెందిన కొంత మంది ఈ భూమి అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 'ప్రభుత్వం మాది.. ఎమ్మెల్యే మావాడే' అని బెదిరిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి భూమిని దళితులకే ఇవ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో లక్ష్మన్న, ఎవన్న, జీవరత్నం, దేవదానం, సుంకన్న, అంజినయ్య, ఆదాము, జయన్న, ప్రేమరాజు, జయకర్ తదితరులు ఉన్నారు.

గస్తీలో మృత్యు ఒడికి!

- కాలువ గట్టు నుంచి పడిపోయిన మోటారు సైకిల్
- ఇద్దరు గస్తీ గార్డ్స్ మృతి
- బాపురం సమీపంలో దుర్ఘటన



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు , (ఇన్‌సెట్) మృతులు కురుబ సోమశేఖర్, కాళింగ (ఫైల్)

ఆలూరు/హాలహర్వి: మోటారు సైకిలు అదుపుతప్పి కాలువ గట్టుపై గస్తీ తిరుగుతున్న ఇద్దరు గార్డ్స్ అక్కడికక్కడే పడి మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి బాపురం సమీపంలో చోటు చేసుకుంది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హాలహర్వి మండలం పచ్చార్లపల్లి గ్రామానికి ఎర్రన్న, మహాకాళి దంపతులకు మారుడు కాళింగ (29), ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన కురుబ అంజనయ్య, తాయమ్మ దంపతుల కుమారుడు కురుబ సోమశేఖర్ (37) కొన్నేళ్లగా గార్డ్స్‌గా పనిచేస్తున్నారు. తుంగభద్ర దిగువ కాలువలో జలచౌర్యం జరగకుండా వీరు గస్తీ తిరుగుతుంటారు. మంగళవారం వారు యథావిధిగా కాలువపై గస్తీ తిరిగేందుకు మోటారుసైకిల్‌పై వెళ్లారు. విధులు ముగించుకుని వస్తున్న సమయంలో బాపురం వద్ద మోటార్ సైకిల్ అదుపు తప్పి కాలువ గట్టుపై నుంచి కింద పడింది. ఈ ప్రమాదంలో కాళింగ, సోమశేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం విధులకు వెళ్లిన వారు రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలువురిని వాకబు చేశారు. మోటారు సైకిల్ అదుపుతప్పి కింద పడి పొలాల్లో మృతి చెందారని రైతులు.. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేర వేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హాలహర్వి హెడ్ కానిస్టేబుల్ గిడ్డయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. కాళింగకు భార్య శృతి, ఇద్దరు సంతానం ఉన్నారు. కురుబ సోమశేఖర్‌కు భార్య లక్ష్మి , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుల కుటుంబసభ్యులకు ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరుపాక్షి, పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సంతాపాన్ని తెలియజేశారు.

నల్లమలలో వజ్రాన్వేషణ

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులోని సర్వ నరసింహస్వామి ఆలయ సమీపంలో వజ్రాల అన్వేషణ కొనసాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చి వజ్రాల వంకలో



వజ్రాల కోసం వెతుకుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు



హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామంలో పొంగిపొర్లుతున్న వాగు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. నంద్యాల జిల్లాలో అతి భారీ వర్షాలు పడుతుండగా.. కర్నూలు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడుతోంది. నంద్యాల జిల్లాలో ఈనెల మొదటి 12 రోజుల్లోనే 101 శాతం, కర్నూలు జిల్లాలో 23 శాతం అధిక వర్షపాతం నమోదైంది. రుతుపవనాలు చురుగ్గా ఉండటం వల్ల ఈ నెల చివరి వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా 95.7 మి.మీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా 12 రోజుల్లోనే 154.3 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. నంద్యాల జిల్లాలో కేవలం రెండు మండలాల్లో మాత్రమే 13 శాతం లోటు వర్షపాతం ఉంది. డోన్ నియోజకవర్గంలో మాత్రమే వర్షాధారం పంటల సాగు ఉండగా.. కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వర్షాధారం కిందనే పంటల సాగు ఉంది. వర్షాలు పడుతుండటం వల్ల ఖరీఫ్ ఊపందుకుంటోంది.

మండలం	వర్షపాతం(మి.మీ)
రుద్రవరం	60.4
సంజామల	47.2
శిరువెళ్ల	41
డోన్	36.8
దొర్నిపాడు	32.6
హొళగుంద	32.2
ప్యాపిలి	31.8
గోస్పాడు	30.4
దేవనకొండ	25.4

తారెత్తిస్తున్న టమాట.. ఘాటెక్కుతున్న ఉల్లి

- పెరిగిపోతున్న కూరగాయల ధరలు



కర్నూలు(అగ్రికల్చర్): కూరగాయల ధరలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. టమాట, ఉల్లిగడ్డతో సహా అన్ని రకాల కూరగాయలు ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారు. ఈ ఏడాది వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కూరగాయల సాగుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో మార్కెట్‌లో కొరత ఏర్పడి ధరలు పెరిగాయి. ప్రస్తుతం రైతుబజారులో టమాట కిలో ధర రూ.54 ఉండగా బయట మార్కెట్‌లో రూ.60 ప్రకారం అమ్ముతున్నారు. టమాట సాగుకు ఉమ్మడి కర్నూలు జిల్లా పెట్టింది పేరైనప్పటికీ లేట్ రబీలో సాగు చేయలేదు. దీంతో మదనపల్లి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా పండించే టమాట మార్కెట్‌లోకి రావడానికి రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కొద్ది రోజులుగా ఉల్లికి కూడా డిమాండ్ ఏర్పడింది. అత్యధికంగా ఉల్లి పండించేది ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే. అయితే ప్రస్తుతం ఈ పంట జిల్లాలో ఎక్కడా లేదు. ఖరీఫ్‌లో ఇపుడిపుడే సాగు మొదలవుతోంది. మహారాష్ట నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. హోల్‌సేల్‌గా కిలో ధర రూ.32 నుంచి రూ.38 వరకు ఉంటోంది. రైతుబజారులో రూ.34 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. బయట ధరలు షాక్ కొడుతున్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వీటికితోడు కూరగాయల ధరలు కూడా దడపుట్టిస్తున్నాయి.

సీక్యాంప్ రైతుబజారులో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి....	
టమాట	రూ.54
బెండ	రూ.40
పచ్చిమిర్చి	రూ.80
కాకర	రూ.66
బీర	రూ.60
క్యారెట్	రూ.56
బీన్స్	రూ.90
చౌళకాయ	రూ.50
చిక్కుడు	రూ.66
బీట్‌రూట్	రూ.46
ముల్లంగి గడ్డలు	రూ.46
ఉల్లిగడ్డలు	రూ.40

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డిబార్

కర్నూలు(సెంట్రల్) : రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. కర్నూలు ఎస్టీబీసీ కాలేజీలో నలుగురు, కర్నూలు సాయి కృష్ణ డిగ్రీ కాలేజీ ఒక్కరు మాస్ కాపీయింగ్ పాల్పడుతుండడంతో అధికారులు పట్టుకుని డిబార్ చేశారు. మరోవైపు సెమిస్టర్ పరీక్షకు 1,349 మందికి గాను 1,234 మంది హాజరయ్యారు.

టీజీ భరత్‌కు మంత్రి పదవి



మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న టీజీ భరత్

కర్నూలు: చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన టీజీ భరత్‌కు చోటు లభించింది. ఆర్యవైశ్య కోటాలో ఆయనకు ఈ పదవి దక్కింది. అమరావతిలోని కేసరిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ టీజీ భరత్‌చే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రుల జాబితాలో టీజీ భరత్ పేరు ఉన్నట్లు ముందురోజే సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన ఇంటితో పాటు, మౌర్యా ఇన్ హోటల్ వద్ద పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. టీజీ భరత్ పారిశ్రామికవేత్తగా, రగ్బీ రాష్ట్ర అధ్యక్షునిగా గుర్తింపు పొందారు.

టీజీ కుటుంబానికి రెండోసారి మంత్రి పదవి

టీజీ వెంకటేష్ కుటుంబాన్ని రెండోసారి మంత్రి పదవి వరించింది. 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన టీజీ వెంకటేష్ రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో టీజీ వెంకటేష్ కర్నూలు నుంచి టీడీపీ తరపున పోటీ చేసి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి ఎస్వీ మోహన్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత వచ్చిన ఎన్నికల్లో తన రాజకీయ వారసుడిగా కుమారుడు టీజీ భరత్‌కు బాధ్యతలు అప్పగించారు. 2019 ఎన్నికల్లో టీజీ భరత్ కర్నూలు నుంచి పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హాఫీజ్ ఖాన్ చేతిలో ఓడిపోయారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్‌పై 18,876 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆర్యవైశ్య సామాజికవర్గం కోటాలో టీజీ భరత్‌కు మంత్రి పదవి దక్కడంతో రెండవసారి ఆ కుటుంబాన్ని మంత్రి పదవి వరించినట్లయింది.

బయోడేటా


పూర్తి పేరు	: తుంబలం గుత్తి భరత్
పుట్టిన తేదీ	: ఆగస్టు 5, 1976
విద్యాభ్యాసం	: ఎంబీఏ (అమెరికా)
తండ్రి పేరు	: టీజీ వెంకటేష్
తల్లి పేరు	: టీజీ రాజ్యలక్ష్మి
భార్య పేరు	: టీజీ శిల్ప
పిల్లలు	: కుమారుడు, ఒక కుమార్తె

క్లుప్తంగా

గొర్రెల పెంపకంపై ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు గొర్రెల పెంపకం పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారందరూ అర్హులేనని పేర్కొన్నారు. పది రోజులపాటు శిక్షణ ఉంటుందని, ఆ కాలంలో ఉచిత భోజనం వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు నాలుగు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో ఎమ్మిగనూరు మండలం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9000710508 నంబరును సంప్రదించాలని తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం ధణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న డి. శ్రీనివాసులు బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆలూరు మండలం చిన్నహోతూరు గ్రామానికి చెందిన ఈయన 1997లో హాలహర్వి మండలం నిట్రవట్టి ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆలూరు, హొళగుంద మండలాల్లో పనిచేసి ఆదోని మండలంలోని ధణాపురానికి వచ్చారు. ఆయన మృతికి ఆదోని యూటీఎఫ్ శాఖ నాయకులు, ఉపాధ్యాయులు, స్నేహితులు సంతాపం తెలిపారు.

దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్, డీజిల్

కర్నూలు(అర్బన్): ఏదైనా సొంతంగా వ్యాపారం చేయడం లేదా గుర్తింపు కలిగిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ సొంతంగా మోటరైజ్‌డ్ మూడు చక్రాల వాహనం ఉన్న జిల్లాలోని దివ్యాంగులకు పెట్రోల్/డీజిల్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం(మొదటి పేజీ), ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదేని సంస్థలో పనిచేస్తున్నట్లు ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రం జతపరచాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన జిల్లాలోని దివ్యాంగులు(శారీరక) నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు 08518- 277864 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన రత్నమయ్య (56) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలే మృతి చెందినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రత్నమయ్యకు భార్య విజయలక్ష్మితో పాటు కుమారుడు,కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవారు. ఇటీవల రత్నమయ్యకు గుండెపోటు రావడంతో చికిత్స పొందాడు. అయినప్పటికీ అప్పుడప్పుడూ ఛాతిలో నొప్పి వస్తుండటంతో ఆ బాధ తాళలేక మంగళవారం పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

New Vencher Launching Offer
House for Sale
Near by Pullaiah College, Nandikotkur Road
(Krishnaveni ITI College)
30x45 - 52 Lakhs
30x50 - 58 Lakhs
Cell: 96668 25499
89195 70306

మీసం మెలేస్తున్న సైబర్ నేరగాళ్లు!

- ఆన్‌లైన్ ప్రకటనలు నమ్మి మోసపోతున్న ప్రజలు
- లక్షల రూపాయలు పోగొట్టుకుని తలలు పట్టుకుంటున్న బాధితులు
- వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసుల సూచన
- తక్షణ ఫిర్యాదుతో రికవరీకి అవకాశం



ఆదోని అర్బన్: డబ్బులు ఎవరికీ ఊరికే రావు అన్న సామెత అందరికీ తెలిసిందే. అయినా అక్షరజ్ఞానం లేని వారి నుంచి ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఉద్యోగుల వరకు ఆన్‌లైన్ మోసాల్లో చిక్కుకుంటున్నారు. ప్రతి రోజూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నా కొందరు అత్యాశపరులు మాత్రం జాగ్రత్త పడటం లేదు. రెట్టింపు డబ్బులు వస్తాయని కొందరు, ప్రైజ్‌మనీ వస్తుందని మరికొందరు, తక్కువ వడ్డీకే రుణం ఇస్తామనడంతో ఇంకొందరు మోసపోతున్నారు. క్రెడిట్ కార్డు ఇస్తామని ఆశ పెట్టడం, ఆన్‌లైన్ షాపింగ్ ప్రముఖ కంపెనీల పేర్లను వాడుకుంటూ సైబర్ నేరగాళ్లు చెప్పిన వాటికి ఊ కొడుతూ వివరాలన్నీ చెప్పి వారికి సహకరించి ఖాతాల్లో ఉన్న డబ్బులను కాజేసుకుంటున్నారు. తర్వాత మోసపోయామని తెలుసుకుని బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆదోని పట్టణానికి చెందిన ఒక యువతికి విమానాశ్రయంలో జాబ్ ఉందని చెప్పడంతో ఎమ్మెస్సీ చేసిన ఆమె వెంటనే దరఖాస్తు చేసుకుంది. విమానాశ్రయంలో ఉద్యోగం అంటే ఆ యువతి తల్లిదండ్రులకు కూడా ఆశలు చిగురించాయి. ఫీజుల పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.3.50 లక్షలు స్వాహా చేయడంతో మోసపోయామని తెలుసుకుని, ఇరుగుపొరుగు వారికి తెలిస్తే బాగుండదని మిన్నకుండిపోయారు. అలాగే ఆదోని పట్టణంలో ఆరు నెలల క్రితంపెళ్లి కోసం తల్లిదండ్రులు రూ.3 లక్షలు యువతి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఒక యాప్ లింక్ పంపుతాం.. దానికి రేటింగ్ ఇస్తే రూ.1000 నుంచి రూ.లక్షలు దాకా డ్రా చేసుకోవచ్చని నమ్మించారు. దీంతో ఆ యువతి రేటింగ్ చేయడం మొదలుపెట్టింది. ఈ తరుణంలో రూ.3 లక్షలు ఆ యువతి ఖాతాలో నుంచి మాయమయ్యా యి. విషయం ఆ యువతి తల్లిదండ్రులకు తెలపడంతో ఏమీ చేసేదిలేక ఇరుగుపొరుగువారితో మ ర్యాద పోతుందని ఊరికే ఉండిపోయారు. ఇలాంటివి తెలిసినవి కొన్ని మాత్రమే. తెలియని మరెన్నో ఉన్నాయి. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

ఫిర్యాదు ఇలా...

సైబర్ బాధితులు తొలుత సైబర్ క్రైమ్ హెల్ప్ నంబర్ 1930కు ఫోన్ చేసి విషయం తెలపాలి.

- అలాగే బ్యాంకు కస్టమర్ కేర్‌కు కాల్ చేసి క్రెడిట్, డెబిట్ కార్డులను బ్లాక్ చేయించాలి.
- పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా రాసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.
- బ్యాంకు లావాదేవీల వివరాలు, ఎఫ్ఐఆర్ కాపీలను బ్యాంకు వారికి సమర్పించాలి.
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలంటే హెచ్‌టీటీపీఎస్://జీవోవీ.ఇన్‌లో వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేయాలి.
- జిల్లా కేంద్రంలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో 2022 సంవత్సరంలో 56 కేసులు, 2023లో 39 సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.

మోసాలు ఇలా చేస్తారు..

- కొత్తగా క్రెడిట్ కార్డు వచ్చిందని, దాన్ని యాక్టివేట్ చేస్తామని నమ్మబలుకుతారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాలని ఒత్తిడి తెస్తారు. ఇలా ఓటీపీ చెప్పడంతో గత నెలలో ఆదోని పట్టణానికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తికి చెందిన బ్యాంక్ అకౌంట్‌లో రూ.96 వేలు మాయమైపోయాయి. బాధితుడు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించగా.. 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.
- రుణం ఇస్తామని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తారు. అనతరం ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంట్ ఫీజు, జీఎస్టీ అంటూ రూ.లక్షల్లో వసూలు చేస్తారు. గత నెలలో ఆదోని పట్టణానికి చెందిన రాము అనే వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.07 లక్షలు ఖాళీ చేశారు. మోసపోయామని తెలుసుకున్న బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు.
- ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం ద్వారా వేలి ముద్రను తస్కరించి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బును తెలియకుండా డ్రా చేసుకుంటున్నారు. గతంలో బ్యాంకు ఖాతాలో డబ్బు ఉంటే దాని గురించి ఆలోచించాల్సి పని ఉండేది కాదు. కానీ ఇప్పుడు రోజుకొకసారి అయినా బ్యాలెన్స్ చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక లావాదేవీలు చేసే ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ఎవరూ ఫోన్‌లో సంప్రదించబోరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఆఫర్ల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దు. ఓటీపీలు, లింకులను క్లిక్ చేయవద్దు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దు. లక్షలు ఇస్తామని చెప్పే సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు. జిల్లాలో ప్రత్యేకంగా సైబర్ సెల్ ఉంది. మోసపోయామని తెలుసుకున్న బాధితులు వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– శివనారాయణస్వామి, ఆదోని డీఎస్పీ

తక్షణ ఫిర్యాదుతో సత్వర న్యాయం

ఎవరి బ్యాంకు ఖాతాలోని డబ్బు మాయమైనా లేదా ఓటీపీ చెప్పి సైబర్ నేరగాళ్ల బారిన పడినా బాధితులు వెంటనే 1930 కాల్ సెంటర్‌కు కాల్ చేయాలి. ఈ కాల్‌సెంటర్ 24 గంటలు పని చేస్తుంది. అన్ని బ్యాంకులు, యూపీఐ వ్యాలెట్‌లకు చెందిన ప్రతినిధులు, సిబ్బందితో అనుసంధానమై ఉంటారు. ఫిర్యాదు అందగానే బాధితుడు లావాదేవీల వివరాలన్నీ తీసుకొని ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకున్నారో తెలుసుకొని ఆ బ్యాంకు నోడల్ అధికారికి సమాచారం ఇస్తారు. బాధితుడి ఖాతాను పరిశీలించి నగదు ఏ ఖాతాకు బదిలీ అయ్యిందో గుర్తించి సంబంధిత బ్యాంకు అధికారికి సమాధానమిస్తారు. ఎవరైతే మోసగించి తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు వేసుకున్నారో ఆ బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేస్తారు. అంతేగాకుండా బాధితుడి ఖాతాలోని లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బు ఏదో ఒక బ్యాంకులో ఫ్రీజ్ అయ్యి ఆ బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా సైబర్ నేరగాళ్ల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఒకవేళ అకౌంట్ ఫ్రీజ్ చేసేలోగా నగదు విత్‌డ్రా అయితే, నగదు బదిలీ అయిన విధానం, బ్యాంకులకు ఇచ్చే సాంకేతిక ఆధారాల కారణంగా సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు వీలు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

శిలాఫలకం ధ్వంసం


అర్బన్ కాలనీలో ధ్వంసమైన శిలాఫలకం

ఆత్మకూరు రూరల్: టీడీపీ శ్రేణుల విధ్వంస వైఖరి కొనసాగుతోంది. మంగళవారం పట్టణంలోని షాదీఖానాలో ఉన్న ప్రారంభోత్సవ ఫలకాన్ని తొలగించిన టీడీపీ నేతలు బుధవారం అర్బన్ కాలనీలో ఉన్న మరో శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాన్ని అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆవిష్కరించారు. ఇది జీర్ణించుకోలేని ఈ టీడీపీ నేతలు శిలాఫలకం దిమ్మెపై ఉన్న శిల్పా అనే అక్షరాలును పగులగొట్టి దిమ్మెను నష్టపరిచారు. గెలుపోటములు సర్వసాధారణమని, ఇలాంటి విధ్వంసాలకు పాల్పడటం తగదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

చెట్టుపై నుంచి పడి గాయాలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామానికి చెందిన నిమ్మల గుర్రప్ప వంట చెరుకు కోసం వెళ్లి చెట్టుపై నుంచి కింద పడి గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నిమ్మల గుర్రప్ప పొయ్యిలో కట్టెల కోసం సమీపంలోని నల్లమల అడవికి వెళ్లాడు. చెట్టు ఎక్కి కర్రలు కొడుతుండగా అదుపు తప్పి కింద పడటంతో గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఏఆర్ఎస్ఐ ఇంట్లో చోరీ

కర్నూలు : నగర శివారు కోడుమూరు రోడ్డులోని బృందావన్ కాలనీలో నివాసిస్తున్న ఏఆర్ఎస్ఐ నాగేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగింది. ఈయన బందోబస్తు విధుల నిమిత్తం వెళ్లగా ఈనెల 8వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు బెంగళూరు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, ఏటీఎం కార్డు మూటగట్టుకుని ఉడాయించారు. పొరుగింటి వారు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. ప్రధాన తలుపులు తెరచి ఉండి, బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

కర్నూలు (లీగల్): ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా సత్వరంగా పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. బుధవారం సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించబడిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నంద్యాలకు చెందిన జి.రాంబాబు (వాది) వ్యవసాయదారుడు. ఈయన కుమారుడు జి.చరణ్ 8వ తరగతి చదువుతున్నాడు. హాస్టల్ ఫీజుగా రూ.36,140 చెల్లించి స్కూల్‌లో అడ్మిషన్ పొందాడు. హాస్టల్ నిర్వహణ లోపం కారణంగా మరుసటి రోజే రాంబాబు తన కుమారుడిని హాస్టల్ నుంచి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఆహారాన్ని సరిగ్గా తయారు చేయలేదని ఫిర్యాదు చేసి, తను చెల్లించిన మొత్తాన్ని వాపసు చేయాల్సిందిగా అభ్యర్థించారు. అయితే వారు రూ.13,000 మాత్రమే చెల్లించారు. మిగిలిన మొత్తం రూ.18,140 చెల్లించలేదు. మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడంతో శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. అదాలత్ వారు ప్రతివాదికి నోటీసు జారీ చేశారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు, వాది న్యాయవాది కె.బలరాముడు, ప్రతివాది సమక్షంలో ఇరుపక్షాల మధ్య రాజీ పరిష్కారం చేశారు. ప్రతివాది రాంబాబుకు రూ.18,140 బకాయి, పరిహారంగా రూ.2,860 చెల్లించారు.

‘కిర్గిస్తాన్ అల్లర్లు అపోహ మాత్రమే’

కర్నూలు(అర్బన్): కిర్గిస్తాన్‌లోని బీష్‌కేక్ ప్రాంతంలో జరిగిన అల్లర్లకు మెడిసిన్ చదువుతున్న భారత విద్యార్థులకు ఎలాంటి సంబంధం లేదని ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ వైస్ డీన్ డా.భానుప్రకాష్ స్పష్టం చేశారు. అక్కడ అరేబియన్ దేశాల నుంచి వచ్చి స్థిరపడిన ఈజిప్ట్ విద్యార్థులకు స్థానికులకు మధ్య జరిగిన చిన్న ఘర్షణపై ప్రచారం అధికమైందని చెప్పారు. కిర్గిస్తాన్‌లో మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు బుధవారం సాయంత్రం ఇక్కడ సమావేశం నిర్వహించారు. ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనివర్శిటీ ఫ్యాకల్టీస్ డా.అజీజా అహిటెకోవా, సిటోరా జకిరోవా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఈజిప్ట్ విద్యార్థులపై జరిగిన దాడి వీడియోలను మార్ఫింగ్ చేసి పలువురు విద్యార్థులు మృతి చెందినట్లు ప్రచారం చేశారన్నారు. బీష్‌కేక్‌లో ఉన్న రాయబార కార్యాలయం కూడా వెంటనే స్పందించి ఈ అసత్య ప్రచారాన్ని ఖండించిందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై దాడి


దాడిలో ఇంటి అద్దాలు పగిలిన దృశ్యం

ఓర్వకల్లు: టీడీపీ కార్యకర్తల అరాచకాలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల క్రితం హుసేనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జీకే వెంగన్నపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడిన విషయం మరవక ముందే, అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లోటర్‌బాషా ఇంటిపై బుధవారం రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నారు. దీంతో లోటర్‌బాషా గ్రామాన్ని వదిలి తన కొడుకు వద్ద తలదాచుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన గ్రామ టీడీపీ నాయకులు మల్లెల రాజశేఖర్ అనుచరులు సాయంత్రం లోటర్ బాషా ఇంటిపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఇంటికి అమర్చిన అద్దాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రాజారెడ్డి తెలిపినట్లు బాధితుడు పేర్కొన్నారు.

భూముల వేలంతో రూ.2 లక్షల ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ కార్తీక్

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు సమీపంలో జూపాడు శ్రీ ఆంజనేయ స్వామి, చెన్నకేశవ శివాలయాలకు చెందిన మాన్యం భూములను వేలం వేయటం ద్వారా దేవదాయ శాఖకు రూ.2లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ కార్తీక్ తెలిపారు. బుధవారం మాన్యం భూముల వేలం కార్యక్రమాన్ని ఈఓ ఆధ్వర్యంలో నిర్వహించగా.. రూ.2వేల ధరావత్తు చెల్లించి 13 మంది రైతులు వేలంపాటలో పాల్గొన్నారు. దేవస్థానాలకు మొత్తం 40 ఎకరాల భూములు ఉండగా అందులో 12 ఎకరాలు బీడుగా ఉండడంతో వాటిని ఉచితంగా రైతులకు ఇచ్చినట్లు ఈఓ తెలిపారు. మిగిలిన 28 ఎకరాల భూములను కౌలుకు వేలం వేయగా రూ.2లక్షల ఆదాయం సమకూరిందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు అర్చకులు ఉమామహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోత అనంతరం మామిడిలో యాజమాన్యం

- మూడుసార్లు లోతు దుక్కులు దున్నుకోవాలి
- మొక్క వయస్సును బట్టి పోషకాలు వాడాలి
- చనిపోయిన చెట్ల స్థానంలో కొత్త అంట్లు నాటాలి
- ఉద్యానశాఖ సహాయ సంచాలకులు రామాంజనేయులు సూచనలు




రామాంజనేయులు, ఏడీ, జిల్లా ఉద్యాన శాఖ

కర్నూలు(అగ్రికల్చర్): మామిడి పంట ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే పలు తోటల్లో పంటను పూర్తిగా కోశారు. మిగిలిన తోటల్లో మరికొన్ని రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. మామిడి తోటల యాజమాన్యంలో అంతర సేద్యం చాలా ముఖ్యం. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలం దున్నటం వల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగుపడుతుంది. నేలలో గాలి బాగా ప్రసరించి బాగా పెరుగుతాయి. కలుపు మొక్కల బెడద ఉండదు. నీటికి, పోషకాల వినియోగానికి పోటీ ఉండదు. అంతేగాక నేలలోనే నివసించే హానికర పురుగులు నశిస్తాయి. మామిడి కోత అనంతరం తోటల్లో చేపట్టాల్సిన పనులను ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు(79950 86793) వివరించారు. ఆయన మాటల్లోనే..

''మామిడి కాపు పూర్తి అయిన తర్వాత తొలకరి వర్షాలకు జూన్, జులై నెలల్లో మొదటిసారి, ఆగస్టులో రెండోసారి, అక్టోబర్-నవంబర్ నెలల్లో మూడోసారి భూమిలో పదును చూసుకుని దున్నుకోవాలి. మొదటి దుక్కికి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేలకోత అంతగా ఉండదు. రెండో దుక్కికి కలుపు నివారణ అవుతుంది. మూడో దుక్కి పూత రావడానికి దోహదపడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగ తాలూకు కోశస్థ దశలు నశిస్తాయి. దుక్కి దాలుకు అడ్డంగా దున్నాలి. తోటలో భూమి వాలును బట్టి ప్రతి 10-15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డకట్టలు, కాంటూరు గట్లు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సత్తువ బయటకు కొట్టుకుపోదు. నేలలో తేమ బాగా ఉంటుంది. ఎండు పుల్ల పడదు. వేరుకుళ్లు అంతా ఆశించదు.

సమతుల్య సమగ్ర ఎరువుల యాజమాన్యం

ఎరువులు ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాల్ని సకాలంలో సిఫారసు చేసిన మోతాదులో వేయాలి. వయస్సును బట్టి ఒక్కొక్క చెట్టుకు ఒక సంవత్సరానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలి.

- సంవత్సరం వయస్సు చెట్లకు పశువుల ఎరువు లేదంటే కంపోస్టు 10 కిలోలు, యూరియా 200 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్‌కు 500 గ్రాములు, ఎంఓపీ 150 గ్రాముల ప్రకారం వాడాలి. రెండేళ్ల చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 20 కిలోలు, యూరియా 400 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 1000 గ్రాములు, ఎంఓపీ 300 గ్రాములు వాడాలి. ఐదేళ్ల వయస్సు చెట్లకు పశువుల ఎరువు 50 కిలోలు, యూరియా 1000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 2500 గ్రాములు, ఎంఓపీ 750 గ్రాములు వేయాలి. పదేళ్లు ఆపైన వయస్సు చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 1000 గ్రాములు, యూరియా 2000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్‌కు 500 గ్రాములు, ఎంఓపీ 1500 గ్రాములు వేయాలి. ఈ ఎరువులు ఎరువులను జులై ఆగస్టు నెలల్లో చెట్టు పాదిలో సమానంగా చల్లి నేలలో కలిసేటట్లు చేయాలి.

సూక్ష్మ ధాతువులను ఏటా అందించాలి

మామిడి తోటలో రకరకాల సూక్ష్మ ధాతు లోపాలు కనిపిస్తుంటాయి. కాయలు కోయడం పూర్తి అయిన వెంటనే చెట్లు పుంజుకోవడానికి జింక్ సల్ఫేట్ 5 గ్రాములు + యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత సూక్ష్మ ధాతువులైన జింక్, మెగ్నీషియం, ఇనుము, బోరాన్, మాంగనీస్‌ల మిశ్రమ ద్రావణాన్ని తయారు చేసి జూలై, ఆగస్టు నెలల్లో, చెట్లు కొత్త ఆకు తొడిగేటప్పుడు రెండవసారి పిచికారీ చేయాలి. జింక్ 5 గ్రాములు, మెగ్నీషియం 2 గ్రాములు, మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, సున్నం 6 గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కొత్తగా అంట్లు నాటాలి...

యాజమాన్య పద్ధతులు ఆచరించని, అశ్రద్ధ చేసిన తోటల్లో అక్కడక్కడ చెట్లు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీల్లో మొక్క పెట్టేచోట మళ్లీ ఒక మీటరు పొడవు, ఒక మీటరు వెడల్పు, ఒక మీటరు లోతు సైజులో గుంతలు తీయాలి. గుంతలు తవ్వేటప్పుడు పై అర మీటరు లోతు మట్టిని ఒక పక్కకు లోపలి అర మీటరు మట్టిని మరోవైపు వేర్వేరుగా కుప్పలు వేయాలి. పై మట్టికి 100 కిలో చివికిన పశువుల ఎరువు లేదా 30 కిలోల వర్మీకంపోస్టు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్ కలపాలి. చెదలు ఆశించకుండా 100 గ్రాముల లిండేన్/ఫాలిడాన్(5 శాతం) పొడి మందును, మట్టి ఎరువు మిశ్రమానికి కలపాలి. గుంతను మొదట ఈ మిశ్రమంతో నింపాలి. తక్కువైతే పక్కనున్న మట్టితో గుంత నింపుకుని నాటే ముందు రోజు గుంటకు నీరు పెడితే పోత మన్ను బాగా కుంగుతుంది. గుంత మధ్య భాగంలో కొంచెం మట్టిని తోడి, అంటు వేర్లకున్న మట్టి కదలకుండా, రాలకుండా ముద్దలా ఉంచి మరికొంత మట్టిని చేర్చి కాంప్యాక్ చేయాలి. మట్టి సల్లుగా(లూజుగా) ఉండరాదు. మొక్క చుట్టూ పల్లెం/పాదు చేసి నీరు పోయాలి. నాటేటప్పుడు అంటు కలయిక భూమిలో పూడ్చకుండా జాగ్రత్త పడాలి. నాటిన అంటు సుడిగాలులకు ఊగకుండా అంటు మొక్కకు ఇరువైపులా రెండు చిన్నకర్రలు నాటి పురికోసతో కట్టాలి. నాటిన తర్వాత మొక్క కాండం నిటారుగా ఉండాలి. మొక్క చుట్టూ పాదిలో నెలకొకసారి నేలను తవ్వి గుల్లపరుస్తూ ఉండాలి. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి వేస్తుండాలి. మొక్కచుట్టు తీసిన పాదులో జిబా పొడురు కలపాలి. ఇది నీటిని పీల్చుకొని నిల్వ చేసుకుంటుంది. బెట్ట సమయంలో మొక్కకు నీటిని అందచేస్తుంది.''

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ విజయవాడలో B.P.T. (DOCTOR), B.Sc. MLT, DMLT, డిప్లమో - అనస్తీషియా, కార్డియాక్ కేర్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సులు. అర్హత : ఇంటర్. SC / ST / BC విద్యార్థులకు స్కాలర్‌షిప్పు / ఫ్రీ సీట్లు. సంప్ర : 76800 65835 [V- 2590]

REAL ESTATE

PLOT FOR SALE

■ ఫ్లాష్...ఫ్లాష్...పరివార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి మనీ బ్యాక్ ఆఫర్ కర్నూలులో డబ్బులు తిరిగి చెల్లించే ఏకైక సంస్థ కేవలం 3.5 లక్షలకే 3 సెంట్ల ప్లాటు, అందులో 12 శ్రీగంధం, 12 ఎర్రచందనం చెట్లు ఇవ్వబడును. 3 సెంట్ల ప్లాటు ఉచితం & 24 చెట్లలో వచ్చే ఆదాయంలో 60% మీకే ఉచితం. సెల్: 99638 00314. [L-792216]

HOUSE FOR SALE

■ కర్నూలులోని కల్లూరు గ్రామ పంచాయితీలో విష్ణుప్రియ నగర్, L.P.No. 44/88, S.No. 106/1B6లో గల 332-B, ప్లాటు తూ.ప: 20'', ఉ.ద: 55'' అమ్మబడును. ఈ ప్లాటు బళ్లారి రోడ్డు, Taj Convention, SRMT సమీపమున వున్నది. సం.ప్ర : 9440432411. [A-156]

LAND FOR SALE

■ ఓర్వకల్లు విమానాశ్రయానికి కేవలం 2 కిలోమీటర్ల దూరంలో 1.50 (లేదా) 2.50 ఎకరాల పంట పొలం అమ్మకానికి కలదు. సం.ప్ర: 91105 41552. [L-792208]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6500]

WANTED

■ అపర్ణ టీవీఎస్ షోరూం నందు వర్క్ చేయుటకు టు వీలర్ షోరూం నందు రెండు సంవత్సరముల అనుభవం కలిగిన సర్వీస్ మేనేజర్ కావలెను. కర్నూలు. సం.ప్ర: 88867 81899. [L-446]

■ ప్రముఖ ఫర్నీచర్ షోరూంలో అనుభవం ఉన్న సేల్స్‌మెన్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం. శ్రీ గౌతమ్ మార్కెటింగ్, opp: కాంగ్రెస్ ఆఫీస్, కర్నూలు. సెల్: 9182598572. [L-792215]

■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 39 స్త్రీ/పురు కావలెను. జీతం: 14వేలు+కమీషన్ 6వేలు+ బోనస్+ఫ్రీ రూం+భోజనం. అ: 7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F). కల్లూరు రోడ్, కర్నూలు. ఫోన్ 80748 16824. [L-792214]

■ Wanted qualified and well experienced teachers to teach all subjects for Pre Primary, Primary, and Higher Classes. St Lourdes EM School. Cell: 90100 18661. [L-800653]

■ అర్జెంటుగా కావలెను: నంద్యాల జిల్లా బనగానపల్లె నెహ్రూ హై స్కూల్ నందు ప్రైమరీ, మిడిల్, హై స్కూలు సెక్షన్‌లలో పనిచేయుటకు హిందీ టీచర్లు పిఇటిలు, హాస్టల్ వార్డెన్లు, కేర్ టేకర్లు కావలెను. సం.ప్ర: 6302026495, 9440232715, 9441056875. [L-792211]

■ Wanted SALES EXECUTIVES & ACCOUTANT for Hyundai Car Showrooms in Kurnool, Nandyal and Adoni. Contact- (Subbu - 91601 14474, Puneeth- 91333 14336) - For Sr Accountant (Tally Must) Contact- (Raghu - 98858 22122). [L-800660]

■ Wanted Area Managers, sales officers, sales representatives, for marketing organic agri inputs Experience: 5 to 7 years minimum 3 years for single company required. cont : VEROLEAF ORGANICS HYDERABAD Cell: 95813 85999. [L-35]

■ శ్రీ గౌతమి విద్యా సంస్థలు, యర్రగొండపాలెం నందు మ్యాథమేటిక్స్, ఇంగ్లీషు కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్స్ బోధించుటకు అర్హత అనుభవం గల వారు కావలెను. ✆ 7032285134, 8333905113. [O-189993]

■ కన్సల్టెన్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD.7995984445 [HA-228]

■ Sanjay Ghodawat యూనివర్సిటీకి B.Tech / Admisions చేయుటకు Lady Tele Counselleros కావలెను. Office or Work From Home. Qlf: Any Degree. సంప్రదించండి: 99598 99798, 96400 60006. [NA-23499]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Sailorswave Ship Management Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 7893682065. [H-778921]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165